క్లుప్తంగా

వేరుకుళ్లు నివారణ సాధ్యమే



రైతుకు సూచనలు, సలహాలు ఇస్తున్న హెచ్‌ఓ అమరేశ్వరి

తాడిమర్రి: చీనీలో వేరుకుళ్లును మొదట్లోనే గుర్తిస్తే నివారించడం సాధ్యమేనని ఉద్యాన అధికారి అమరేశ్వరి రైతులకు సూచించారు. తాడిమర్రిలో సోమవారం ఆమె సిబ్బందితో కలిసి చీనీ తోటలను పరిశీలించారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వేరుకుళ్లు తెగుళ్లు ఆశించి చాలా తోటల్లో చెట్లు చనిపోతున్నాయన్నారు. రైతులు సరైన సమయంలో మందులు పిచికారి చేయడం ద్వారా పంటను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ గౌతమి, రైతులు పాల్గొన్నారు.

కందిలో పంటకోత ప్రయోగాలు



దిగుబడి అంచనా వేస్తున్న అధికారులు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని అక్కమ్మ, కళావతి, గంగన్న, హరిప్రసాద్ ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారం కింద సాగు చేసిన కందిలో సోమవారం ఏఓ ఓబిరెడ్డి, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీ నరసింహశర్మ ఆధ్వర్యంలో అధికారులు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. నాలుగు పొలాల్లోనూ దిగుబడి రెండు కేజీలలోపే రావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కోఆర్డినేటర్‌లు మంజునాథ్, హుసేన్ పీరా, చాంద్‌బాషా, పలువురు రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



వికలాంగుల హక్కులపై నాటిక ప్రదర్శిస్తున్న సొసైటీ సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: విభిన్న ప్రతిభావంతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రతిభ సొసైటీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని వెంకటంపల్లి గ్రామంలో ప్రతిభా సొసైటీ ఆధ్వర్యంలో వికలాంగుల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వికలాంగులు అవసరమైన సమయంలో హక్కులను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే మేనరిక వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, సొసైటీ సభ్యులు, మిళిత సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

వేమన పద్యాలపై విద్యార్థులకు పోటీలు



ప్రశంసాపత్రాలను చూపుతున్న గంగినేపల్లి పాఠశాల విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని గంగినేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్యాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెడల్స్ ప్రశంసాపత్రాలను సర్పంచ్ శాంతమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేమన ఫౌండేషన్ సభ్యులు అప్పిరెడ్డి హరినాథరెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం వాణితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ పరిశీలన



ఇసుక నిల్వ రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఎన్‌పీ కుంట : ఎర్రవంకలవారిపల్లిలో నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను సోమవారం గనులు, భూగర్భ శాఖ అధికారులు పరిశీలించారు. హంద్రీ–నీవా కాలువ పనుల్లో భాగంగా రెండేళ్ల కిందట మరికొమ్మదిన్నె పంచాయతీలో పైప్‌లైన్ పనులు చేపట్టిన పీఎల్ఆర్ కంపెనీ వారు ఇసుకను నిల్వ ఉంచినట్లు స్థానికులు తెలిపారు. మైనింగ్ సర్వేయర్‌తో కొలతలు వేయించి 5,400 క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. కార్యక్రమంలో మైనింగ్ శాఖ జిల్లా అధికారి పెద్దిరెడ్డి, తహసీల్దార్ దేవేంద్రనాయక్, మైనింగ్ సర్వేయర్ సునితాబాయి, వీఆర్ఓ రఘు తదితరులు పాల్గొన్నారు.

దడ దడ.. గుండె దడ!

రైల్వే ఓవర్ బ్రిడ్జిపై అడుగడుగునా గతుకులే

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పోతుకుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి అధ్వానంగా ఉంది. కిలోమీటరు మేర పొడవు కలిగిన ఈ బ్రిడ్జిపై ద్విచక్రవాహనం నుంచి భారీ వాహనాల వరకు రోజూ వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిడ్జిపైకి ప్రవేశించి కిందకు వచ్చే వరకు అడుగడుగునా గతుకులే దర్శనమిస్తున్నాయి. వాటిమీద వాహనాలు వెళ్లినపుడు దడదడమంటూ శబ్దాలు వస్తుంటాయి. వీటిపై పలు వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురైన సంఘటనలూ లేకపోలేదు. ద్విచక్రవాహనాలపై నుంచి కిందపడిన వారు నడుములు విరిగి ఆస్పత్రుల పాలైన వారూ ఉన్నారు. ధర్మవరం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సత్యకుమార్‌తో పాటు ఉన్నతాధికారులు సైతం ఈ బ్రిడ్జిపై ప్రయాణిస్తున్నా రోడ్డు దుస్థితిని పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బ్రిడ్జిపై గుంతల్లోనే ఇబ్బందికరంగా ప్రయాణం చేస్తున్న వాహనదారులు



గుంతల రహదారిపైనే ప్రయాణం



గుంతలను తప్పించేందుకు అవస్థలు పడుతున్న ఆటో డ్రైవర్



బ్రిడ్జి దిగే ప్రాంతంలో పెద్ద గుంత

ఇక నుంచి ఎంపీడీఓ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

కదిరి అర్బన్: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ఇక నుంచి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

నల్లచెరువు/ తనకల్లు: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. నల్లచెరువు మండలం కమ్మవారిపల్లికి చెందిన శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం కారులో అరుణాచలం బయల్దేరాడు. మదనపల్లి వద్దనున్న బసినికొండ గంగమ్మ వద్ద కారును ఆపి.. రోడ్డు దాటుతున్న శివశంకర్‌రెడ్డిని మరో కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు గమనించి 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తనకల్లు మండలం బొమ్మిరెడ్డిపల్లికి చెందిన ఓబులేసు అనే వ్యక్తి సోమవారం వ్యక్తిగత పనిమీద ద్విచక్రవాహనంపై పరాకువాండ్లపల్లి సమీపంలోని పాల డెయిరీ వద్దకు వెళ్లి వస్తుండగా లారీ ఢీకొంది. బలమైన గాయాలు కావడంతో వెంటనే 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

పార్టీ అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆత్మకూరు, కనగానపల్లి మండలాల నాయకులకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతంపై సోమవారం అనంతపురం నగర శివారులోని తన క్యాంపు కార్యాలయంలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరినీ గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అనుబంధ కమిటీలు బలమైన శక్తిగా తయారు కావాలన్నారు. అలివిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడు నెలల్లోనే హామీల అమలుపై చేతులెత్తేసిందన్నారు. జగనన్న హయాంలో ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటిదాకా ఏ ఒక్క పథకమూ అమలు కాలేదని.. ఎక్కడికి పోయినా ప్రజలు చెబుతున్నారన్నారు. ఏడు నెలల్లోనే తిరుగుబాటు మొదలైందన్నారు. ప్రజల పక్షాన గొంతు వినిపించాల్సిన బాధ్యతపై మనపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా, అధినేత వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంగుల భానుమతి, ఆత్మకూరు ఎంపీపీ హేమలత, యువజన, వాలంటీర్ విభాగాల శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు గంగుల సుధీర్‌రెడ్డి, ఓబుగారి హరినాథరెడ్డి, ఆత్మకూరు, కనగానపల్లి మండలాల పార్టీ కన్వీనర్లు బాలపోతన్న, నాగమునెప్ప, జిల్లా కార్యదర్శి కురుబ వెంకటరాముడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

కనగానపల్లి: రైతన్నలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ జీ.వీ.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ఎన్డీఏ కూటమి నాయకులు హంద్రీ–నీవా కాలువ వెడల్పు, పిల్ల కాలువలు ఏర్పాటు చేసి రాప్తాడు నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరందిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. రైతు భరోసా కింద ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి.. మోసం చేశారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని మండిపడ్డారు. వెంటనే నెరవేర్చకపోతే రైతులతో కలసి ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, సహాయ కార్యదర్శి మల్లికార్జున, రైతు సంఘం నాయకులు గోవిందు, నాగరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధిపై టీడీపీ కార్యాలయంలో సమీక్ష

పుట్టపర్తి టౌన్: మున్సిపల్ అభివృద్ధిపై టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సోమవారం పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద, డీఈ నరసింహమూర్తి, పుడా సిబ్బంది హాజరయ్యారు. ఇదివరకు స్వచ్ఛభారత్ కింద కేంద్రం విడుదలైన రూ.10 కోట్లలో ఖర్చు చేయకుండా నిర్లక్ష్యం చేసినందున రూ.5కోట్లు వెనక్కు వెళ్లిపోవడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కారాదన్నారు. ఇంటి, ఆస్తి పన్ను బకాయిలు రూ.10 కోట్లకు పైగా ఉన్నాయని, అధికారులు కార్యాలయంలో కూర్చుంటే ఎలా వసూలవుతాయని ప్రశ్నించారు. పట్టణంలో డ్రెయినేజీ తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి

పశు ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

బత్తలపల్లి: ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు, గొర్రెల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం మండలంలోని బత్తలపల్లి, ఈదుల ముష్టూరు పంచాయతీల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ శ్రీనివాసులు, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డితో కలిసి పర్యటించారు. 55 పశువులకు సాధారణ పరీక్షలు చేసి వైద్యం అందించారు. 22 పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు, ఐదు ఆవులకు కృత్రిమ గర్భధారణ, 253 పశువులకు, 6,453 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సురేష్‌నాయక్, మారుతి, సాయి ప్రణవి, సాల్మన్‌రాజు, బి.శ్రీనివాసులు, టి.శ్రీనివాసులు, నందిని ప్రియ, పశువైద్య సహాయకులు, గోపాలమిత్రులు, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.



బత్తలపల్లిలో పశు ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటి డైరెక్టర్ చంద్రశేఖర్

గాండ్లపెంట: మండల పరిధిలోని మద్దివారిగొంది, సోమయాజులపల్లి పంచాయతీల్లో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశువైద్యాధికారి కేశవనాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి పై రెండు గ్రామాల్లో 320 పశువులు, గొర్రెలకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు, పశు పోషకులు పాల్గొన్నారు.



పశువులకు చికిత్స చేస్తున్న పశు వైద్యాధికారి కేశవనాయక్

ముదిగుబ్బ: గాండ్లవారిపల్లిలో సోమవారం ధర్మవరం ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వీరభద్రయ్య ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పాడి పశువులకు, గొర్రెలకు ఉచిత వైద్యం, నట్టల నివారణ, గొర్రెలలో బొబ్బ వ్యాధికి టీకాలు, గర్భకోశ వ్యాధులకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యనారాయణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కారు డ్యామేజీపై ఫిర్యాదు

తలుపుల : మండల కేంద్రంలోని కుమ్మరపేటలో ఆదివారం తన కారును భార్గవ అనే వ్యక్తి డ్యామేజీ చేసినట్లు బాధితుడు సురేష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు భార్గవపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహుడు సోమవారం తెలిపారు.

కారు ఢీకొని ఆవుదూడ మృతి



మృతి చెందిన ఆవుదూడ

బత్తలపల్లి: రామాపురం కూడలి వద్ద సోమవారం కారు ఢీకొని ఆవుదూడ మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడిమర్రి మండలం మర్రిమాకులపల్లికి చెందిన వెంకటరాముడు సోదరుడు బత్తలపల్లి మండలం రామాపురంలో పాడి ఆవులను పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఆవులను మేపునకు తీసుకువెళ్తున్న ఆయన రోడ్డు దాటుతుండగా కదిరి వైపు నుంచి అనంతపురం వెళ్తున్న కారు ఆవుదూడను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆవుదూడ అక్కడికక్కడే మృతి చెందింది.

పీఎం ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఓడీచెరువు : ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ కోరారు. ఈ పథకం ద్వారా యువతకు ప్రతిష్టాత్మక కంపెనీల్లో పని, అనుభవం, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఒకసారి రూ.6వేలు, ప్రతి నెలా రూ.4,500 అందజేస్తారు. 18 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి పది, ఇంటర్మీడియెట్, ఐటీఐ, పాలిటెక్నిక్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కోసం చైతన్య (93986 43930)ను సంప్రదించాలని సూచించారు.

శ్రీశైలానికి స్పెషల్ లగ్జరీ బస్సు

కదిరి అర్బన్: మాఘమాసాన్ని పురస్కరించుకుని కదిరి నుంచి శ్రీశైలానికి స్పెషల్ లగ్జరీ బస్సు సర్వీసు నడపనున్నట్లు డీఎం మైనోద్దీన్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం నుంచి ఈ బస్సు సర్వీసు రాత్రి 7.30 గంటలకు కదిరి నుంచి బయలుదేరుతుందని పేర్కొన్నారు. రాత్రి 7.30 గంటలకు కదిరిలో బయల్దేరి పులివెందుల, తాడిపత్రి, నంద్యాల, ఆత్మకూరు, దోర్నాల మీదుగా శ్రీశైలానికి ఉదయం 7 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి శ్రీశైలంలో రాత్రి 7.30 గంటలకు బయలుదేరి అదే మార్గంలో కదిరికి చేరుతుందని వెల్లడించారు. ఆన్‌లైన్ రిజర్వేషన్‌సదుపాయం ఉంటుందని తెలిపారు.

● డివైడర్‌ను ఢీకొన్న ఐషర్



బత్తలపల్లి: పొగమంచు ప్రభావంతో రోడ్డు కనిపించక ఐషర్ వాహనం డివైడర్‌ను ఢీకొంది. గ్రామస్తులు తెలిపిన మేరకు... సోమవారం తెల్లవారుజామున కదిరి వైపు నుంచి అనంతపురం దిశగా వెళుతున్న ఐచర్ వాహనం కోడేకండ్ల వద్ద డివైడర్‌ను ఢీకొని కదిరి వైపు తిరిగి ఆగిపోయింది. అదే సమయంలో ఐచర్ వాహనం వెనుక ఏ వాహనాలు లేవు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆ సమయంలో పొగ మంచు కారణంగా తనకేమీ కనిపించలేదని డ్రైవర్ తెలిపాడు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ముదిగుబ్బ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని కదిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వరప్రసాద్, ఏఎంవీఐ రాజేష్ సూచించారు. సోమవారం పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వాహనదారులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడపకూడదన్నారు.

భవనాలు పూర్తయ్యేదెన్నడు?



బిల్లులు రాక చీకిరేవులపల్లిలో ఆగిపోయిన భవన నిర్మాణాలు

- 8 నెలలైనా అందని బిల్లులు
- ముందుకు సాగని నిర్మాణ పనులు

అమడగూరు: గ్రామ స్వరాజ్య సాధనలో భాగంగా గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టారు. ప్రభుత్వ సేవలన్నీ గ్రామస్థాయిలోనే అందించాలనే ఉద్దేశంతో సచివాలయం, రైతు సేవా కేంద్రం, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. పక్కా భవనాల నిర్మాణాలు సైతం చేపట్టారు. పలు చోట్ల భవనాలు పూర్తయ్యాయి. మరికొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలవుతున్నా నిర్మాణాలు పూర్తి చేయించడంపై ప్రత్యేక దృష్టి సారించలేదు. నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అమడగూరు మండలంలో తొమ్మిది సచివాలయ భవనాలకు గాను ఐదు, ఏడు రైతు సేవ కేంద్రాలలో రెండు పూర్తయ్యాయి. ఆరు హెల్త్‌క్లినిక్‌లకు గాను ఒకటి మాత్రమే పూర్తయింది. మిగిలిన ఐదు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

అందుబాటులోకి తేవాలి



ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకురావడానికి సచివాలయాలు, రైతు సేవ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు ప్రారంభించారు. అయితే పక్కా భవనాల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చి పూర్తిస్థాయిలో సేవలందించాలని కోరుతున్నాం.

– ఈశ్వర్‌రెడ్డి, రైతు, సోలుకుంట్ల, అమడగూరు

బిల్లులు పంపాం



గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలకు సంబంధించి ఆరు నెలల క్రితమే బిల్లులు పెట్టాం. ఉన్నతాధికారుల నుంచి నిధులు విడుదల కాగానే భవనాల నిర్మాణాలను పూర్తి చేయిస్తాం. తొందర్లోనే బిల్లులు జమ కానున్నాయి. పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కూడా ఆదేశించాం.

– మునెప్ప, ఎంపీడీఓ